

# 'అదే' కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి.  అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

### 69

### మంచిరోజు, ముహూర్తం

వెంకట్రావుకి చిన్నప్పట్నుంచే జాతకాలంటే నమ్మకం ఏర్పడ్డానిక్కారణం ఇంట్లో అలవాట్లే అని చెప్పుకోవాల్సిందే. తల్లితండ్రులకి  అన్నింటికీ పట్టింపు ఉంది. ఎక్కడకైనా వెళ్ళాలంటే పంచాగం తీసి ముహూర్తం చూస్తారు. పెళ్ళి కానీ మరో శుభ కార్యం కానీ అయితే ముహూర్తం చూడ్డం బాగానే ఉన్నా పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊరికెళ్ళడానికీ, అర్జంట్ గా చేయాల్సిన పనులకీ పంచాగం చూస్తూంటే చిరాకు మొదలైనా సర్దుకోవడం అలవాటయ్యాక కొన్నాళ్ళకి వెంకట్రావుకే అలవాటైంది ముహూర్తం మంచిదో కాదో చూడ్డం. స్కూల్లో జేరడానికో, కాలేజీకి అప్లికేషన్ పెట్టడానికో కూడా ముహూర్తం చూడ్డం. ఇంటి ఓనర్ కి అద్దె కట్టాలంటే మంగళవారం, శుక్రవారం డబ్బులు ఇవ్వరాదు అది ఒకటో తారీఖు అయినా సరే. ఓనర్ 'ఇదేంటండి, మేము బతకాలిగా, అలా మంగళ వారం శుక్రవారం అంటూ అద్దె ఇవ్వకపోతే ఎలా?' అన్నా సరే ముహూర్తం, రోజూ, వారం అన్నీ చూసుకుని చేయాలి పనులు.

మరో విషయం పేరు మంగళవారం పొద్దు.  మీరు ఎవరికో డబ్బులివ్వాలి, వాళ్ళు సోమవారం వచ్చి అడిగారు. మీ దగ్గిర డబ్బులున్నాయి ఇవ్వడానికి. కానీ ఇవ్వరు, ఎందుకని అడిగితే ఇదీ సమాధానం  – మంగళవారం పొద్దు కనక

ఇవ్వకూడదు. అదేమిటి, ఈ రోజు సోమవారం కదా అంటే, అబ్బే మీరు వచ్చినది సోమవారం సాయంత్రం. దాన్ని మా పరిభాషలో మంగళవారం పొద్దు అంటారు. అందువల్ల మరోసారి రండి. 'అలాగా సరే రేపు మంగళవారం వస్తా' అని వచ్చినాయన అంటే, 'అబ్బే కుదరదు. బుధవారం రండి.' మంగళవారం పొద్దు నుంచి బుధవారం పొద్దున్నవరకూ ఇదీ రొటీన్. ఇంక లక్ష్మివారం, శుక్రవారం సంగతి చెప్పడానికేముంది? ఆ రోజుల్లో ఎవరికీ చేతిలోంచి డబ్బులు ఇవ్వరాదు. ఇస్తే లక్ష్మి ఇంట్లోంచి వెళ్ళిపోదూ?

అలా వెంకట్రావు పెరిగి పెద్దవాడై మొత్తానికి ఇంజినీరింగ్ లో చేరాడు. కాలేజీలో జేరాక హాస్టల్లో మరో కుర్రాడు రూమ్మేట్ గా తగిలాడు. వాళ్ళది మదనపల్లె. వాళ్ల ఆహారపు అలవాట్లు వేరే, భాష కొంచెం తేడాగా ఉన్నా తెలుగువాడని సంతోషించవల్సిందే. ఏ పరాయి రాష్ట్రం కుర్రాడో అయితే ఎలా ఉంటుందో చెప్పడం కష్టం కదా? రూమ్మేట్ కి మొదట్లో మన వెంకట్రావు ముహూర్తాలు, మంచీ చెడూ చూడ్డం కొంచెం సరదాగా ఉండేది. అయితే అది మితిమీరినట్టు గమనించాక వెంకట్రావుని వెక్కిరించడం మొదలుపెట్టాడు. దీనికి కారణాలు అనేకం. ఫలానా రోజునుంచి పరీక్షలు మొదలౌతాయంటే, ఏరోజు నుంచి చదివితే మంచిది, ఏ రోజుకి పంచాంగంలో మంచిదని రాసారు అనేవి చూడ్డం మొదటి కారణం అయితే మంచి ముహూర్తం వల్ల మంచి మార్కులొస్తాయనే నమ్మకం మరోటి. 'ఇవన్నీ పనికిరాని విషయాలయ్యా, పుస్తకం తీసి చదువు మొదలుపెట్టు' అని చెప్పడానికి రూమ్మేట్ ప్రయత్నం చేసాడు కానీ వెంకట్రావు వినిపించుకునే స్టేజ్ దాటాడు అప్పటికే.

మొత్తానికి ఇద్దరూ మంచి మార్కులతో పాసైనట్టే. ఇద్దరూ స్టూడెంట్ వీసా మీద అమెరికా రావడానికి అప్లికేషన్లు పెట్టుకున్నారు. ఒకప్పుడైతే కాన్సులేట్ కి వెళ్ళిపోయి లైన్లో నుంచునే వెసులుబాటు ఉండేది కానీ ఇప్పుడు ముందు అన్నీ ఆన్ లైన్ లో పెట్టుకోవాలి. ఎప్పుడో వీలు బట్టి వాళ్ళు 'ఇదిగో ఈ టైమ్ కి రండి ఫలానా రోజున' అని పిలుస్తారు. అమెరికా కాన్సులేట్ వారికి పంచాంగం చూసీ నక్షత్రం చూసీ అపాయింట్ మెంట్లు ఇవ్వడం చాతకాదూ, కుదరదూ కదా? అలా వెంకట్రావుగారికి జూన్ ఇరవై ఆరున పొద్దున్న తొమ్మిదీ నలభైకి పిలిచారు వీసా ఇంటర్వ్యూకి. రూమ్మేట్ అపాయింట్ మెంట్ ఆ పై వారంలో మరోరోజు పదకొండింటికి.

మొదట వెంకట్రావు చేసిన పని పంచాగం చూసి వీసా కి ఇచ్చిన సమయం మంచిదా కాదా చూడ్డం. వీసా టైమ్ ముహూర్తానికి పంచాంగంలో 'యమగండం' అని ఉంది. అది మధ్యాహ్నం పన్నెండింటి వరకూ. అప్పట్నుండి భయం పట్టుకుంది. వెళ్ళాలా వద్దా? రూమ్మేట్ తో చెప్పాడు. ఆయన ఫెళ్ళున నవ్వాడు. 'యముడేం చేస్తాడు గురూ, మనం వెళ్ళేది వీసా ఇంటర్వ్యూకి, ఇది యమరాజుల వారి డిపార్ట్ మెంట్ కాదు' అనేసాడు. ఏం చేయాలో తోచలేదు. తల్లి తండ్రులతో చెప్తే ఏమంటారో చెప్పక్కర్లేదు. వీసా ఇంటర్వ్యూ కేన్సిల్ చేసుకుంటే అమెరికా వెళ్ళేదారికి స్వయానా తిలోదకాలు ఇచ్చుకున్నట్టే. భయం భయంగా గడిపాక ఏదైతే అదే అవుతుందని రూమ్మేట్ తో పాటు బయల్దేరి వెళ్ళాడు. ఏమౌతుంది?

ఏమీ కాలేదు. అమెరికా కాన్సులేట్ వారు అడిగే ప్రశ్నలూ, వాళ్ళు చూసే కాయితాలు యమరాజు డిపార్ట్ మెంట్ కాదనేది నిజం. "నీ దగ్గిర డబ్బులున్నాయా ఫీజులు కట్టడానికి? లేకపోతే ఆస్తులున్నాయా అమ్మి అమెరికా డబ్బులు తెచ్చుకోవడానికి?" అంటూ ప్రశ్నలు వేసి వీసా ఇచ్చారు. హమ్మయ్య అనుకుంటూ బయటకొచ్చాక రూమ్మేట్ అన్నాడు, "నేను చెప్పానా? ఇది యమరాజుల వారి డిపార్ట్ మెంట్ కాదని?" విమానం టికెట్ కొనేటప్పుడు ఒకే ఒక రోజుకి టికెట్ దొరికింది. ముహూర్తం చూసుకోకుండా వెళ్ళితీరాలి. ఈ రెండూ జరిగాక వెంకట్రావు మనసులో 'ఏమో నిజంగా ముహూర్తాలు అంత సరిగ్గా పనిచేయవేమో?' అనే శంక మొదటిసారి పడడానికి కారణం అయింది. రూమ్మేట్ కి న్యూయార్క్ రాష్ట్రంలో ఎక్కడో వచ్చింది సీటు. వెంకట్రావుకి ఈ పక్క కొలారాడోలో. అమెరికా వెళ్ళిన మొదట్లో అప్పుడప్పుడూ ఫోన్ చేసుకుని పలకరించుకున్నా దూరం వల్ల మెల్లిగా వెంకట్రావుకీ రూమ్మేట్ కీ స్నేహం తెగిపోయినట్టే.

రూమ్మేట్ తో పాటు అమెరికా వచ్చిన అయిదేళ్ళకి ఉద్యోగం సంపాదించి పట్టాభిషేకానికి దేశం వెళ్లడానికి తయారయ్యేడు వెంకట్రావు. జర్మనీలో ఆరుగంటల లే ఆఫ్ వల్ల విమానం దిగాక ఓ మూల కూర్చుని కునికిపాట్లు పడుతూంటే ఎవరో తట్టారు వెంకట్రావుని. చూస్తే ఇంకెవరు? తన రూమ్మేట్! ఇంక అవే కబుర్లు; "ఏం చేస్తున్నావు, ఏం ఉద్యోగం, హా, హా" అనే నవ్వులూ, మధ్యలో కాఫీ అవీ అవుతూంటే తెల్సిన విషయం ఇది – రూమ్మేట్ కి మంచి ప్రొఫెసర్ దొరికాడు. ఎమ్ ఎస్ అయ్యాక ఇద్దరూ కలిసి ఓ కంపెనీ పెట్టబోతున్నారు. వెంచర్ కాపిటల్ అన్నీ సిద్ధంగా ఉన్నై. అయితే అమెరికా వచ్చి అయిదేళ్ళైంది కనకా ఈ కంపెనీతో పనిలో బాగా బిజీ అయితే మళ్ళీ ఇండియా ఎప్పుడు వెళ్తాడో తెలియదు కనకా ఓ సారి అందర్నీ చూసి వెళ్దామని బయల్దేరాడు. "అబ్బే అప్పుడే పెళ్ళీ గిళ్ళీ జాంతానై. మరో మూడేళ్ల తర్వాత చూడాలి. అయినా ఇప్పుడు వయసు ఇరవై అయిదేగా? ఇంకా బోల్డు జీవితం ఉంటే ఇప్పుడే ఎందుకు పెళ్ళి?" అయితే రూమ్మేట్ అడిగినదానికి వెంకట్ సమాధారం వేరేగా ఉంది. వెంకట్ చెప్పాడు దేశం వెళ్ళేదెందుకో – పెళ్ళి చేసుకుని అమ్మగార్ని తీసుకురావాలి. కానీ వెళ్ళిన మూడు వారాల్లో ముహూర్తం కుదరకపోతే ఏమి చేయాలో తెలియదు.

రూమ్మేట్ కాసేపు ఆగి అన్నాడు, "ఓ మాట చెప్తాను వింటావా? ఎవరు నీకు ఈ ముహూర్తాలు, మంచిరోజులు అనేవి బుర్రలోకి ఎక్కించారో నాకు తెలియదు కానీ నువ్వు కాలేజీ రోజులనుంచీ ఇలా పంచాగం అవీ చూడ్డం నాకు తెల్సిందే. పంచాగాలు ఎలా ఉంటాయో నీకు తెలుసు మార్కెట్లో. ఎవరిష్టం వచ్చినట్టు వాళ్ళు రాసి అమ్ముకోవచ్చు. ఒక దాంట్లో యమగండం అనేది మరోచోట వేరేగా ఉండొచ్చు. ఒక పూజారినో పండితుణ్ణో పట్టుకుని ముహూర్తం పెట్టమంటే ఆయన పెట్టినది మరొకరు తప్పు అనొచ్చు. వాళ్లలో వాళ్ళే ఒప్పుకోరు ఏ విషయమూ కూడా. తిరుపతి వెళ్తున్నావనుకో దేవుణ్ణి చూడ్డానికి, ప్రయాణానికి ముహూర్తం, ఎప్పుడు స్టేషన్ కి వెళ్ళాలి అనేదానికి ముహూర్తం అంటూ కూర్చోడం ఎంతవరకూ లాభం? అయినా నువ్వు తిరుపతి వెళ్ళేది ఏ ముహూర్తాలూ, ఏ చెడూ అంటుకోని భగవంతుణ్ణి చూడ్డానికి. మళ్ళీ అందులో ముహూర్తం ఏమిటి? చూసుకోవాల్సింది ఒక్కటే – నీకు ట్రైన్ లో రిజర్వేషన్ ఉందా? కొండమీద రూమ్

దొరుకుతుందా, దర్శనానికి టికెట్ ఉందా లేదా? అంతే మిగతావన్నీ అనవసరం. అవునా కాదా? అయినా అమెరికాలో ఎంతమంది పంచాగం చూస్తారు ఏ పనైనా చేయడానికి? ఏ బిల్ గేట్స్ కానీ జెఫ్ బెజోస్ కానీ ఎప్పుడైనా ముహుర్తం పెట్టి హారతి ఇచ్చి కొబ్బరికాయ కొట్టి కంపెనీ మొదలుపెట్టడం చూసేవా?"

అంతా విని కాసేపు ఊరుకున్న తర్వాత వెంకట్రావు చెప్పేడు, "అవున్లే కానీ ఓ సారి ఇంటికెళ్ళాక అమ్మానాన్నా వప్పుకోరు కదా ఇవన్నీ? ఏం చేస్తాం?' దీనికి రూమ్మేట్ చెప్పాడు సమాధానం. "అంతా అమ్మా నాన్నల మీద తోయకు బ్రో. నేను గమనించినంతవరకూ ఇది నీ వీక్నెస్ కూడా. పెళ్ళిళ్ల సీజన్ లో నీ పెళ్ళికి ముహుర్తం ఎలాగో ఒకలాగ కుదిరించే పండితులు నీకు బోల్డు మంది దొరుకుతారు ఇండియాలో. ఏదైనా తేడాలొస్తే నేను చెప్పిన "ఈ ముక్క" చెప్పు మీ అమ్మా నాన్నలతో. నాకు టైమ్ అవుతోంది ఫ్లైట్ కి. నా ఫోన్ నెంబర్ ఇచ్చాను కదా, అప్పుడప్పుడూ ఫోన్ చేస్తూ ఉండు. వెనక్కి వచ్చాక నన్ను ఇంటికి పిలవడం మర్చిపోకు. వదినగారు ఎలా ఉందో నేను చూడొద్దూ?" అలా చెప్పి రూమ్మేట్ జనంలో కలిసిపోయేడు, వెంకట్రావు నవ్వుతూండగానే. పాఠక మహాశయా వెంకట్రావుకి ఆయన రూమ్మేట్ చెప్పిన 'ఈ ముక్క' ఏమిటో అర్థం అయిందా? ఇంకా తెలియకపోతే కింద నీతి చదువుడు.

నీతి: పంచాగం చూసేవారికి మంచిరోజులూ చెడ్డరోజులూ కనిపిస్తాయి. పంచాగం చూడనివారికి అన్నీ మంచిరోజులే.

Post your comments